




VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 53 | గురువారం 23 జూలై 2026 | పేజీలు : 8 | వెల : 2/-


## పిక్‌యాక్స్ అణు కేంద్రం పై దాడి చేస్తామన్న యూఎస్! ఇది సాధ్యమేనా

ఇరాన్‌లోని పిక్‌యాక్స్ అణు శుద్ధి కేంద్రంపై దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో హెచ్చరిక జారీ చేశారు. దీంతో, మరోసారి కలకలం రేగుతోంది. అయితే, అసలు ఈ అణుకేంద్రంపై దాడి సాధ్యమేనా? ఇందుకు తగిన ఆయుధాలు యూఎస్ వద్ద ఉన్నాయా? అన్న సందేహాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. పిక్‌యాక్స్ అనే పర్వతం అడుగున భూగర్భంలో 100 మీటర్ల లోతున ఈ అణుకేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



2

## పార్లమెంట్‌లో గళమెత్తుతుంటే.. మోదీతో శరద్ పవార్ భేటీ

- ప్రధాని కార్యాలయంలో మోదీతో శరద్ పవార్, సుప్రియా సూలే సమావేశం
- పవార్‌ను ఆత్మీయంగా ఆహ్వానించిన మోదీ
- ఎన్‌డీఏ కూటమిలో పవార్ పార్టీ చేరుతుందంటూ ఊహాగానాలు



2

## ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి: ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్

- ప్రధాని మోదీ జోక్యం చేసుకుని ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని విజ్ఞప్తి
- యువత హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టీకరణ
- ధర్మేంద్రను తొలగించకుంటే మోదీ రాజీనామా చేయాలన్న ముఖ్యమంత్రి

నీట్ పేపర్ లీకేజీ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.



2

## ఢిల్లీలో ప్రధానితో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ



2

- ఆగస్ట్ 1న జరగనున్న కార్యక్రమానికి ప్రభుత్వం భారీ ఏర్పాట్లు
- ప్రత్యేక బాధ్యతలతో నలుగురు ఐఏఎస్ అధికారుల నియామకం
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని అంచనా

## మంగళగిరి ప్రజలు భారీ మెజారిటీ ఇచ్చారు.. భారీగా అభివృద్ధి చేస్తా



2

మంగళగిరి నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని, రాష్ట్రమంతా ఈ నియోజకవర్గం వైపు చూసేలా అభివృద్ధి చేసి చూపిస్తానని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా రెండోరోజైన బుధవారం మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన సుమారు 3 వేల మంది లబ్ధిదారులకు శాశ్వత ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తన పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## బీజేపీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత.. రామచందర్ రావు అరెస్ట్



2

గాంధీభవన్ ముట్టడికి బీజేపీ పిలుపు ఇచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో బీజేపీ నేతలు పోలీసుల చర్యలను వ్యతిరేకిస్తూ నిరసనకు దిగారు. నేతల అరెస్టుల సందర్భంగా పోలీసులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## తమ్మినేని కుటుంబానికి హైకోర్టులో దక్కని ఊరట.. అరెస్ట్ నుంచి రక్షణకు నిరాకరణ

- భూకబ్జా కేసులో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు హైకోర్టులో ఎదురుదెబ్బ
- తమ పై నమోదైన ఎఫ్ఐఆర్ కొట్టేయాలన్న పిటిషన్‌ను తోసిపుచ్చిన న్యాయస్థానం
- అరెస్ట్ నుంచి మధ్యంతర రక్షణ కల్పించేందుకు నిరాకరణ
- విచారణ ప్రాథమిక దశలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన కోర్టు
- హైకోర్టు తీర్పు నేపథ్యంలో తమ్మినేని కుటుంబం అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం




2

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
గురువారం 23 జూలై 2026

## పార్లమెంట్‌లో గళమెత్తుతుంటే.. మోదీతో శరద్ పవార్ భేటీ

ఒకవైపు నీట్ లీకేజీతో పాటు పలు అంశాలపై పార్లమెంట్ వెలుపల విపక్ష ఎంపీలు తీవ్ర స్థాయిలో నిరసనలు, నినాదాలతో హోరెత్తిస్తుంటే... మరోవైపు ప్రధాని కార్యాలయంలో జరిగిన ఒక కీలక భేటీ దేశ రాజకీయాల్లో పెను దుమారాన్ని రేపుతోంది. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, ఆయన కుమార్తె సుప్రియా సూలేలు ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోల్లో ప్రధాని మోదీ స్వయంగా శరద్ పవార్‌ను చిరునవ్వుతో చేతిని పట్టుకుని ఆహ్వానించడం, ఇద్దరు నాయకులు ఎంతో సంతోషంగా నవ్వుకుంటూ చర్చించుకోవడం కనిపించింది. రైతుల సమస్యలు, నీటిపారుదల రంగానికి సంబంధించిన పలు అంశాలపై పవార్ ప్రధానికి వినతిపత్రం సమర్పించినట్లు సమాచారం. ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మూడింట రెండొంతుల మెజారిటీ కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఈ సమయంలో 8 మంది ఎంపీలు ఉన్న శరద్ పవార్ పార్టీ మద్దతు ప్రభుత్వానికి చాలా కీలకంగా మారింది. దేశవ్యాప్తంగా 50 శాతం సీట్ల పెంపుపై ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇస్తే ఈ బిల్లుకు మద్దతు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని ఇటీవలే సుప్రియా సూలే సంకేతాలు ఇచ్చారు. ఈ పరిణామాల మధ్య శరద్ పవార్ పార్టీ ఎన్డీఏ కూటమిలో చేరుతుందనే ఊహాగానాలు కూడా మొదలయ్యాయి. అయితే, మహారాష్ట్రలోని రెండు ఎన్సీపీ వర్గాలు (అజిత్ పవార్, శరద్ పవార్ వర్గాలు) మళ్లీ విలీనమైతేనే ఎన్డీఏలో అధికారికంగా భాగస్వామ్యం కల్పిస్తామని, వ్యక్తిగతంగా లేదా విడివిడిగా చేర్చుకునే ఉద్దేశం లేదని బీజేపీ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. విపక్ష ఇండియా కూటమి కేంద్ర ప్రభుత్వంపై విమర్శల దాడిని తీవ్రతరం చేసిన సమయంలోనే, ఆ కూటమిలోని కీలక నేత శరద్ పవార్ ప్రధానితో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది.

## పిక్‌యాక్స్ అణు కేంద్రం పై దాడి చేస్తామన్న యూఎస్! ఇది సాధ్యమేనా

పిక్‌యాక్స్ అనే పర్వతం అడుగున భూగర్భంలో 100 మీటర్ల లోతున ఈ అణుకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇంకా నిర్మాణ పనులు అక్కడ కొనసాగుతున్నాయి. ఇరాన్‌లోని ప్రధాన నటాన్జ్ న్యూక్లియర్ కాంప్లెక్స్‌కు దక్షిణా 2 కిలోమీటర్ల దూరంలో ఈ అణుకేంద్రం ఉంది. 2020లో నటాన్జ్ కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. దీని వెనుక కుట్ర ఉందని భావించిన ఇరాన్ ప్రభుత్వం పిక్‌యాక్స్ పర్వతం అడుగున అణుశుద్ధి కేంద్రం ఏర్పాటును ప్రారంభించింది. అక్కడ ఇంకా నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ కేంద్రం చుట్టూ పలు గగనతల రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ఇరాన్ సైన్యానికి చెందిన ప్రత్యేక దళం ఐఆర్‌జీసీ కూడా గట్టి పహారా కాస్తోంది. అసలు ఈ కేంద్రంలో ఏమి దాగుందనే విషయాలపై కూడా పూర్తి స్పష్టత లేదు. అయితే, అణు శుద్ధికి కావాల్సిన సెంట్రిఫ్యూజ్ పరికరాలను ఏర్పాటు చేస్తున్నామని 2020లో ఇరాన్ పేర్కొంది. పిక్స్‌యాక్స్ కేంద్రంపై దాడి చేసేందుకు అమెరికా తన వద్ద ఉన్న జీబీయూ–57 బాంబును ప్రయోగిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. భూగర్భంలో దాగున్న ఇలాంటి కేంద్రాలను ధ్వంసం చేసేందుకే అమెరికా ఈ క్షిపణిని అభివృద్ధి చేసుకుంది. ఇది భూగర్భంలో దాగున్న కేంద్రాలను ధ్వంసం చేయగలదు. రెండు క్షిపణులను ఒకదాని వెంట మరొకటి పిక్‌యాక్స్ కేంద్రంపై గురిపెడితే అణుకేంద్రాన్ని ధ్వంసం చేయడం సాధ్యమని అమెరికా నిపుణులు అభిప్రాయపడుతున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అసలు ఈ వ్యూహం ఫలిస్తుందా? ఇందుకు జీబీయూ–57 సామర్థ్యం సరిపోతుందా? అనే సందేహాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

## బీజేపీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత.. రామచందర్ రావు అరెస్ట్

నేతల అరెస్టుల సందర్భంగా పోలీసులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. బీజేపీ నాయకుల అరెస్టుపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా, ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాసం ఎదుట మంగళవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆందోళన చేశారు. దీనికి నిరసనగా బీజేపీ అగ్రనేతలు గాంధీభవన్‌ను ముట్టడించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బీజేపీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో హై టెన్షన్ నెలకొంది.

**కరీంనగర్‌లో బండి సంజయ్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత**

ఇక, కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయం వద్ద కూడా ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు బండి సంజయ్ కార్యాలయం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. కాంగ్రెస్ నేతలను అడ్డుకునే క్రమంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలు బండి సంజయ్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో ఆఫీసు పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత కొనసాగింది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. రాష్ట్రంలో ఒకే రోజు బీజేపీ రాష్ట్ర కార్యాలయం, కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఈ పరిణామాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపడుతున్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి: ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్

నీట్ పేపర్ లీకేజీ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను బాధ్యతల నుంచి తొలగించలేకపోతే, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన పదవికి రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మోదీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు తన నియోజకవర్గం నుంచే ప్రతిన బూనుతున్నానని ఆయన వెల్లడించారు. బీజేపీ గాడ్సే వారసత్వానికి ప్రతీక అయితే, కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న వారసత్వం కలిగిన పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు. నరేంద్ర మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ కలిసి ఈ దేశాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వారిని ఏమాత్రం విజయం సాధించనివ్వబోమని హెచ్చరించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో వీధుల నుంచి పార్లమెంటు వరకు పోరాటం సాగించి బీజేపీని ఓడిస్తామన్నారు. యువత భవితవ్యంతో, దేశ భవిష్యత్తుతో మోదీ చెలగాటమాడుతున్నారని ఆయన మండిపడ్డారు. నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై నిరసనలు వెల్లు వెత్తుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)తో పాటు ఇతర విపక్షాలు కూడా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ పరిణామాల వల్ల విద్యార్థులు మానసికంగా, విద్యా పరంగా తీవ్రంగా నష్టపోతున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థ పై ప్రజలకు తిరిగి నమ్మకం కలిగించాలంటే తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలంటూ ఇప్పటికే పలు వర్గాల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షల నిర్వహణలో లోపాలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించి, భవిష్యత్తులో సంస్కరణలు చేపడతామని ప్రకటించినప్పటికీ, విపక్షాలు మాత్రం కేంద్ర మంత్రి పై వేటు వేయాల్సిందేనని పట్టు బడుతున్నాయి.

# ఢిల్లీలో ప్రధానితో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఆగస్ట్ 1వ తేదీన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ప్రధానిని స్వయంగా ఆహ్వానించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా ఇరువురు నేతల మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ అయ్యారు. ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి అత్యంత కీలకమని, దీని ప్రారంభోత్సవానికి తప్పక రావాలని వారు ప్రధానిని కోరారు. మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర, రాజమండ్రి కమిషనర్ రాహుల్ మీనా, గుంటూరు కమిషనర్ మయూర్ అశోక్‌లు ప్రజా అవసరాలు, పారిశుద్ధ్య వ్యవహారాలు పర్యవేక్షిస్తారు. వీరికి సహకారం అందించేందుకు మరో 26 మంది నాన్–క్యాడర్ అధికారులను కూడా నియమించారు. వీరంతా విజయనగరం జిల్లా కలెక్టర్‌కు రిపోర్ట్ చేస్తూ ఏర్పాట్లను సమన్వయం చేయనున్నారు. విజయనగరం జిల్లాలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న ఈ 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' ఉత్తరాంధ్ర ప్రాంతానికి మణిహారంగా నిలుస్తుందని నిపుణులు భావిస్తున్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం ఏర్పాటు తర్వాత ఆ ప్రాంతంలో వచ్చిన అభివృద్ధి తరహాలోనే భోగాపురం పరిసరాలు కూడా శరవేగంగా అభివృద్ధి చెందుతాయని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు వేలాదిగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

# మంగళగిరి ప్రజలు భారీ మెజారిటీ ఇచ్చారు.. భారీగా అభివృద్ధి చేస్తా

ఈ ఎన్నికల్లో ప్రజలు తనకు 91 వేల ఓట్ల భారీ మెజారిటీ కట్టబెట్టారని, ఆ విజయమే తనకు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసేందుకు కొండంత బలాన్ని ఇస్తోందని లోకేశ్ అన్నారు. "మీరిచ్చిన ఈ అఖండ విజయం వల్లే నేను కేంద్రంలోని పెద్దలతో మాట్లాడి నిధులు తీసుకురాగలుగుతున్నా. మంగళగిరి ప్రజలే నా కుటుంబం. ఇక్కడ నాకు సొంత అక్కాచెల్లెళ్లు లేకపోయినా, మీ అందరినీ చూస్తుంటే నా సొంతవారిని చూసినట్లే ఉంటుంది" అని ఆయన భావోద్వేగంగా ప్రసంగించారు. 2019 ఎన్నికల నాటి అనుభవాలను లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "అప్పుడు ఇంటి పట్టాల రెగ్యులరైజేషన్‌పై హామీ ఇవ్వమని అడిగారు. కానీ, పూర్తి అవగాహన లేకుండా హామీ ఇవ్వడం సరికాదని చెప్పడంతో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఆ ఓటమి నాలో కసి పెంచింది. అప్పటి నుంచి ఐదేళ్ల పాటు అహర్నిశలు శ్రమించి మంగళగిరి ప్రజల మనసు గెలుచుకున్నా" అని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సొంత నిధులతో ఎన్టీఆర్ సంజీవని క్లినిక్‌లు, తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు, పేదల ఇళ్లలో శుభకార్యాలకు సాయం, అంత్యక్రియలకు ఆర్థిక సాయం వంటి 29 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టానని వివరించారు. మంగళగిరిని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. నియోజకవర్గంలోని భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం రూ.1800 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కేంద్రం నుంచి ఛాలెంజ్ ఫండ్, రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ నిధులతో ఈ పనులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. దీంతో పాటు వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, పార్కులు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధి, మూసేసిన అన్నా క్యాంటీన్ల పునఃప్రారంభం, పైప్‌లైన్ గ్యాస్ వంటి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. నిడమర్రు స్కూలులో సీటు కోసం ఒక తల్లి తనతో వాదించడం ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన నాణ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తోందని లోకేశ్ అన్నారు. 'తల్లికి వందనం' పథకం కింద అర్హులైన తల్లుల ఖాతాల్లో నేటి నుంచి నిధులు జమ చేస్తున్నామని, 4 వేల రూపాయల పింఛను, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి హామీలను దశలవారీగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పనిచేయడం వల్లే కేంద్రం నుంచి నిధులు సులభంగా వస్తున్నాయని, నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను 12 నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు నందం అబద్ధయ్య, పోతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# తమ్మినేని కుటుంబానికి హైకోర్టులో దక్కని ఊరట.. అరెస్ట్ నుంచి రక్షణకు నిరాకరణ

శ్రీకాకుళంలో సంచలనం సృష్టించిన భూకబ్జా కేసులో మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ నేత తమ్మినేని సీతారాం, ఆయన కుటుంబ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో తమపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని (క్వాష్) కోరుతూ తమ్మినేని సీతారాం, ఆయన భార్య వాణి, కుమారుడు చిరంజీవి నాగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. వారిని అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. మంగళవారం ఈ పిటిషన్‌పై జస్టిస్ వై. లక్ష్మణరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని, ఇలాంటి సమయంలో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. అరెస్ట్ భయం ఉంటే ముందస్తు బెయిల్ (యాంటిసిపేటరీ బెయిల్) కోసం పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని పిటిషనర్లకు సూచించింది. కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసులకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను జూలై 29కి వాయిదా వేసింది. శ్రీకాకుళం పట్టణం, చాపరం గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు రూ.4 కోట్ల విలువైన 900 గజాల స్థలాన్ని కబ్జా చేశారని తమ్మినేని కుటుంబంపై ఆరోపణలు ఉన్నాయి. బతికున్న యజమాని చనిపోయినట్లు నకిలీ మరణ ధృవీకరణ పత్రం సృష్టించి, దొంగ పత్రాలతో ఆ స్థలాన్ని తమ్మినేని కుమారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించారని కట్టా జయకిషోర్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో పోలీసులు మొత్తం 13 మందిని నిందితులుగా చేర్చగా, ఇప్పటికే 8 మందిని అరెస్ట్ చేశారు. హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాత తమ్మినేని సీతారాం, ఆయన కుటుంబ సభ్యులు ఆమదాలవలసలోని తమ నివాసం నుంచి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు వార్తలు వస్తున్నాయి. వారి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

# "మా సమయం వృథా చేయొద్దు"

జాతీయ స్థాయి పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థులు చేపట్టిన 'చలో సంసద్' నిరసన సందర్భంగా పోలీసుల చర్యను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఈ అంశాన్ని ప్రస్తావించగా, "మా సమయం వృథా చేయొద్దు" అంటూ భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఉదయం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు ఈ పిటిషన్ వచ్చింది. విద్యార్థులపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని, అందుకు సంబంధించిన వీడియో ఆధారాలు తన వద్ద ఉన్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. వాటిని పరిశీలించి, గురువారం విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన సీజేఐ.. "మేము వీడియోలు చూడాలనుకోవడం లేదు. వాటిని చూసే సమయం మాకు లేదు. మీ, మా సమయాన్ని వృథా చేయొద్దు" అని స్పష్టం చేస్తూ తక్షణ విచారణ అభ్యర్థనను తోసిపుచ్చారు. జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో జరిగిన నీట్ వంటి పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు, యువత జులై 20, 21 తేదీల్లో 'చలో సంసద్' కార్యక్రమం చేపట్టారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం రోజున జంతర్ మంతర్ వద్ద ఈ నిరసన చేపట్టగా, అది ఉద్రిక్తంగా మారింది. పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను అడ్డుకునేందుకు భద్రతా సిబ్బంది ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పాటు, బాష్పవాయువు ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు, భద్రతా సిబ్బంది గాయపడినట్లు సమాచారం. అయితే, ఆందోళనకారులు హింసాత్మకంగా, అదుపు తప్పి ప్రవర్తించారని ఢిల్లీ పోలీసులు ఆరోపించారు. ఇదే అంశంపై దాఖలైన పిటిషన్‌ను నిన్న ఢిల్లీ హైకోర్టు కూడా అత్యవసరంగా విచారించేందుకు నిరాకరించింది. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీకే ఉపాధ్యాయ నేతృత్వంలోని ధర్మాసనం, "ఇలాంటి అన్ని విషయాల్లోకి కోర్టును లాగొద్దు" అని వ్యాఖ్యానిస్తూ పిటిషన్‌ను తిరస్కరించింది. ఇప్పుడు సుప్రీంకోర్టు కూడా ఇదే తరహాలో స్పందించడం చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టు రెండూ తక్షణ విచారణకు నిరాకరించడంతో పిటిషనర్లు ఇప్పుడు సాధారణ రిజిస్ట్రీ ప్రక్రియ ద్వారా తమ పిటిషన్ ఎప్పుడు విచారణకు వస్తుందో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## పార్లమెంట్ మార్చ్ లో యువతపై లాఠీచార్జి బందు పై వాల్ పోస్టర్లు విడుదల



కర్నూలు జూలై 22 వార్త సాక్ష్యం

దేశంలో వరుసగా పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు,పేపర్ లీకులు, అవినీతి, అక్రమాలు విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్నాయని. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలనీ.జూలై 24న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు వామపక్ష విద్యార్థి--యువజన సంఘాలు పిలుపునిచ్చాయి.ఈ బంద్ ను విజయవంతం చేయాలని విద్యార్థులు, యువత, అధ్యాపకులు, ప్రజాస్వామ్యవాదులు పెద్దఎత్తున పాల్గొని మద్దతు ఇవ్వాలని పిలునివ్వడం జరిగింది..ఈ సందర్భంగా బుధవారం కర్నూల్ మీడియా పాయింట్ ముందు వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో బంద్ పోస్టర్లను విడుదల చేశారు.

## మూడవరోజు కొనసాగుతున్న డాక్యుమెంట్ రైటర్ల నిరసన



ఆత్మకూరు, జులై 22 వార్త సాక్ష్యం

పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు బుధవారం డాక్యుమెంట్ రైటర్స్ మూడవరోజు నిరసన వ్యక్తం చేశారు. పది రోజులపాటు పెన్ డౌన్ చేస్తున్నట్లు తెలిపారు. జీవో 396 ప్రకారం రిజిస్ట్రేషన్ సర్వీస్ సెంటర్లు ఏర్పడితే తాము జీవనోపాధి కోల్పోతామని డాక్యుమెంట్ రైటర్స్ ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 396 ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు.ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాలని తెలిపారు. దస్తవేజు లేఖర్ల స్టాంపు వేండర్ల డిటిపి ఆపరేటర్ల జీవనోపాధిని కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్ లక్ష్మణమూర్తి, నాగేంద్రప్ప, మొహిద్దిన్, వెంకటేశ్వర్లు, షఫీ వుల్లా, శశిధర్, రఘు, రమేష్, ధను, జఫ్రాన్, ప్రతాప్, రజాక్ శీను తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా ఈనెల 24 తేదీన జరిగే భారత్ బంద్ ను జయప్రదం చేయండి

-బంద్ కు సంపూర్ణ మద్దతు తెలిపిన గిరిజన విద్యార్థి యువజన సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కటారి కృష్ణ నాయక్

నంద్యాల జులై 22 వార్త సాక్ష్యం



ఈనెల 24 జరిగే భారత్ బంద్ కు నంద్యాల జిల్లాలో ని కార్పొరేట్ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాలలో పీజీ కళాశాలలో యాజమాన్యం మరియు తల్లిదండ్రులు విద్యార్థులు మేధావులు సహకరించాలని గిరిజన విద్యార్థి యువజన సంఘం అధ్యక్షుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కటారి కృష్ణ నాయక్ బుధవారం ఓ .ప్రకటనలో విజ్ఞప్తి చేశారు ఢిల్లీలోని పటేల్ చౌక్ వద్ద శాంతియుతంగా మంగళవారం నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు యువకులపై పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు లాఠీఛార్జ్ చేయడం అత్యంత హేయమైన చర్య అన్నారు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. ఆ హక్కును కాలరాస్తూ నిరసనకారులు, మహిళలు, విద్యార్థులపై అమానుషంగా లాఠీఛార్జ్ చేయడం ప్రజాస్వామ్య విలువలపై దాడిగా భావిస్తున్నాం. నిజాలను ప్రజలకు చేరవేస్తున్న జర్నలిస్టులను అడ్డుకో వడం, మీడియాపై ఆంక్షలు విధించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదంగా భావిస్తున్నాం. లాఠీఛార్జ్కు బాధ్యులైన అధికారులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి. గాయపడిన నిరసనకారులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనీ డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష లీకేజీకి బాధ్యత వహిస్తూ ఇప్పటికైనా కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ఆందోళనకు తలొగ్గి విద్యార్థులతో తక్షణమే చర్చలు జరపాలని మోడీ ప్రభుత్వాన్ని ఆయన ప్రకటనలో డిమాండ్ చేశారు

# భూ రికార్డుల శాశ్వత భద్రతకు బ్లాక్‌చెయిన్

-రేపు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా 'మీభూమి--బ్లాక్‌చెయిన్' పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం

-7 జిల్లాల పరిధిలోని 7 మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ అమలు

-భూ రికార్డులకు 'సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్'గా మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్ట్

-భూ మోసాలకు చెక్... వేగవంతమైన, పారదర్శక సేవలే లక్ష్యం

అమరావతి, జూలై 22 వార్త సాక్ష్యం

భూ రికార్డుల నిర్వహణలో సాంకేతిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో విడివిడిగా ఉన్న భూ సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకువస్తూ, రాష్ట్రంలోని భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా నిలిచే 'మీభూమి--బ్లాక్ చెయిన్' వ్యవస్థను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. గురువారం మధ్యాహ్నం రాష్ట్ర సచివాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది. కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రస్తుతం వెబ్‌ల్యాండ్ ద్వారా భూ రికార్డులు డిజిటలైజ్ అయినప్పటికీ, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో సమాచారం వేర్వేరుగా ఉండటం వల్ల డేటా వ్యత్యాసాలు, రికార్డుల్లో మార్పులను గుర్తించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా మీ భూమి--బ్లాక్ చెయిన్ వ్యవస్థను రూపొందించారు. నైస్ ఆంధ్రప్రదేశ్, నైస్ బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్స్ లైన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశాయి. ఈ వ్యవస్థలో ప్రతి భూ పార్సెల్‌కు ప్రత్యేక బ్లాక్‌చెయిన్ గుర్తింపు కల్పిస్తారు. ప్రతి లావాదేవీ టాంపర్-ప్రూఫ్, సెక్యూర్టీతో జరగనుంది. భూ రికార్డుల్లో ఎలాంటి మార్పు చేయాలన్నా ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ సేవల ద్వారానే ఇకపై సాధ్యమవుతుంది. ఒక భూ పార్సెల్‌కు సంబంధించిన అన్ని రకాల లావాదేవీలు, వాటి ప్రతి వెర్షన్‌తో సహా శాశ్వతంగా నమోదయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దారు. ఇక ప్రతి లావాదేవీని ఏ అధికారి, ఎప్పుడు నిర్వహించారనే వివరాలు కూడా శాశ్వతంగా రికార్డుల్లో ఉంటాయి. రికార్డుల్లో ఏమైనా వ్యత్యాసం ఉంటే లావాదేవీ వెంటనే ఆగిపోయేలా వ్యవస్థను రూపొందించారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే వేదికపైకి తీసుకువస్తున్న ఈ వ్యవస్థలో ప్రస్తుతం ఆటో మ్యూటేషన్, సబ్-డివిజన్, ఎక్స్‌టెంట్ కరెక్షన్ సహా ఎనిమిది పౌర సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. వ్యవసాయం, మత్స్యశాఖ, గనులు,



పరిశ్రమలు, విద్యుత్ శాఖ, సీఆర్‌డీఏ, ఆర్థిక సంస్థలు వంటి విభాగాలు కూడా అవసరమైన మేరకు ఈ సమాచారాన్ని వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. మొదటి దశలో కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలోని అస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల్లో ఈ పైలట్ ప్రాజెక్టుగా అమలు కానుంది. ఈ పైలట్ ప్రాజెక్టులో 89 రీ-సర్వే గ్రామాలు, 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ అవుతున్నాయి.

## దేశ వ్యవసాయ రంగాన్ని సర్వనాశనం చేసే అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం వద్దు:ఏ ఐ కె ఎస్





ఆత్మకూరు జులై 22 వార్త సాక్ష్యం

దేశ వ్యవసాయ రంగాన్ని సర్వ నాశనం చేసి, రైతాంగానికి తీవ్ర నష్టం కలిగించే అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై కేంద్ర మోడీ ప్రభుత్వం సంతకం పెట్టవద్దని, అమెరికా సామ్రాజ్యవాదులకు లొంగవద్దని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏ. రాజశేఖర్, రైతు సేవా సంఘం అధ్యక్షులు బైరాపురం మహబూబ్ బాషా, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం స్వాములు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంమండల అధ్యక్షులు పి మహబూబ్ బాషాలు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని రైతులు,కౌలు రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ముందర మోడీ ట్రంప్ దిష్టిబొమ్మలను దగ్ధం చేసి, ర్యాలీగా వెళ్లిస్థానిక తాసిల్దార్ రత్న రాధిక కు మెమోరాండం అందించడం జరిగిందని అన్నారు ఈ సందర్బంగా మాట్లాడుతూ అమెరికాతో భారత ప్రభుత్వం కుదుర్చుకుంటున్న ఫ్రీ ట్రేడ్ డీల్ పై అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ప్రమాదకరం అంటూ నినాదాలు చేశారు.ఈనెల 24న కేంద్ర మోడీ ప్రభుత్వం అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేసేందుకు తహతలాడుతోందని, ఈ ఒప్పందం రైతుల పాలిట ఉరితాడని విమర్శించారు. దేశ వ్యవసాయ రంగాన్ని నాశనం చేసే ఈ ఒప్పందంపై సంతకం పెట్టవద్దని దేశవ్యాప్తంగా రైతులు పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం దుర్మార్గ మన్నారు. అమెరికా నుండి పాలు,పాలు పదార్థాలు, కోడి కాళ్లు, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, కూరగాయలు, పండ్లు వంటి అనేక వ్యవసాయ ఉత్పత్తులను ఎటువంటి సుంకాలు లేకుండా దేశంలోకి దిగుమతి అవుతాయని, ఫలితంగా ఇప్పటికే మద్దతు ధరలు లేక నష్టపోతున్న రైతులు మరింతగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ సంక్షోభం మరింత పెరిగి ఇప్పటికే నిత్యం జరుగుతున్న రైతుల ఆత్మహత్యలు మరింత పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా 5 లక్షల కోట్ల రూపాయలు దేశ సంపద కొల్లగొట్టబడుతుందని చెప్పారు. ఈ ఫ్రీ ట్రే డీల్ అత్యంత ప్రమాదకరమని, ఈ ఒప్పందంపై సంతకం పెట్టవద్దని డిమాండ్ చేశారు. రైతులు కోరుతున్న విధంగా మద్దతు ధరల గ్యారంటీ చట్టం తీసుకురావాలని, దేశవ్యాప్తంగా రైతుల రుణాలు మాఫీ చేయాలని కోరారు. 60 సంవత్సరాలు దాటిన పేద రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులకు ప్రతి నెల రూ. 10వేలు పెన్షన్ అమలు చేయాలని, పాత పద్ధతిలో ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఫ్రీ ట్రేడ్ డీల్ పై కేంద్ర ప్రభుత్వం వెనక్కి వెళ్లకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పాల శివుడు, రాముడు, దేవకుమార్, శేఖర్, చిన్న అంబయ్య, సోమేశ్,సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు ఏ.రణధీర్, కార్యదర్శి డి రామ్ నాయక్, చిన్న వ్యాపారస్తుల సంఘం కార్యదర్శి తుమ్మలూరు శివకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను మర్యాదపూర్వకంగా కలిసిన 19 వ వార్డు టీడీపీ ఇంచార్జి



-షేక్ మహమ్మద్ రఫీ మున్నా

నంద్యాల జులై 22 వార్త సాక్ష్యం

పవిత్ర ఉమ్ర యాత్రను విజయవంతంగా ముగించు కొని నంద్యాలకు చేరుకున్న నంద్యాల టౌన్ 19 వ వార్డు పొన్నాపురం మరియు పొన్నాపురం కాలనీ ఇంచార్జి షేక్ మహమ్మద్ రఫీ (మున్నా) బుధవారం నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాల యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ను , అలాగే నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా షేక్ మహమ్మద్ రఫీ మున్న పవిత్ర ఉమ్ర యాత్ర నుంచి తెచ్చిన పవిత్ర జలాన్ని (జమ్ జమ్ నీళ్లు), ఖర్జూరాలను మరియు ఉమ్రాయాత్ర పవిత్ర చిహ్నాన్ని మంత్రి ఎన్ఎండి ఫరూక్ అత్యంత భక్తిశ్రద్ధలతో బహుకరించారు. ఈ భేటీలో షేక్ మహమ్మద్ రఫీ (మున్నా) మంత్రి ఫరూక్ ని మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ గ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మంత్రి ఎన్ఎండి ఫరూక్ కూడా షేక్ మహమ్మద్ రఫీ (మున్నా) ని ప్రత్యేకంగా అభినందిస్తూ, శాలువాతో సత్కరించి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



VARTHAA SAKSHAMU
Editor : SAGINALA RAVI KUMAR
తెలుగు దిన పత్రిక

# చిన్నారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం










**-287 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీ**

**-నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య**

నందికొట్కూరు జులై 22 వార్త సాక్ష్యం

పట్టణంలోని మండల పరిషత్ సమావేశ వేదికలో ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య హాజరయ్యారు ముందుగా ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఆరు మండలాల్లో 287 అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన ఇండక్షన్ స్టవ్‌లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పోషకాహారాన్ని మరింత పరిశుభ్రంగా, సురక్షితంగా తయారు చేసేందుకు ఇండక్షన్ స్టవ్‌లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అందుకు అనుగుణంగా అంగన్వాడీ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పిస్తున్నట్లు తెలిపారు.అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ చిన్నారుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని ఎమ్మెల్యే గిత్త జయసూర్య ప్రశంసించారు. కేంద్రాల్లో పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పిల్లలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ప్రభుత్వం మహిళలు, చిన్నారుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఇండక్షన్ స్టవ్‌ల వినియోగంతో వంట ప్రక్రియ వేగవంత మవడంతో పాటు ఇంధన వినియోగం తగ్గి, పరిశు భ్రమైన వాతావరణంలో ఆహార తయారీ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తోన్న 42,860 మంది, గ్రామీణ, గిరిజన అంగన్వాడీ సిబ్బంది పిల్లలకు కూడా 'తల్లికి వందనం' పథకాన్ని ఈరోజు తల్లుల అకౌంట్లో డబ్బులు జమ చేయడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారుఈ కార్యక్రమంలో: సొసైటీ చైర్మన్ మూర్తి జావలి, ఎమ్మార్వో, ఎంపీడీవో ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, పార్టీ నాయకులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమిపాలనలో విజయం సాధించిన-ఎమ్మెల్యే గిత్త జయసూర్య..!














**-48 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని గ్రామానిక బస్సు సౌకర్యం.**

**-రాష్ట్రానికి వెలుగునిచ్చారు వారి జీవితాల్లో చీకటియే.**

**-కృష్ణానది ముంపు గ్రామాల ప్రజలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య.**

**-అర్థ శతాబ్దం తర్వాత గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటుకు కృషి.**

**-విద్య వైద్యం కోసం ఎనిమిది కిలోమీటర్లు ప్రతిరోజు నడవాల్సిందే.**

**-కృష్ణమ్మ పరవళ్ళ మధ్య నది తీర ప్రజలకు రవాణా సౌకర్యం.**

**-ఎమ్మెల్యే గిత్త జయసూర్య కు బలపాల తిప్ప, జనాల గూడెం, సిద్దేశ్వరం గ్రామ ప్రజల కృతజ్ఞతలు.**

**-బస్సు సౌకర్యం రావడంతో హర్షం వ్యక్తం చేసిన కృష్ణానది తీర గ్రామ ప్రజలు.**

ఆత్మకూరు జులై 22 వార్త సాక్ష్యం.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 77 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా దేశానికి మంచి రోజులు వచ్చాయని చెప్పవచ్చు. దాదాపు అర్థ శతాబ్దం తర్వాత గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు ఎంతోమంది పాలకులు నేతలు మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలు ఉన్న ఈ ప్రాంత ప్రజల సమస్యలు తీరేవి కావు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీటి ముంపు గ్రామాలను అభివృద్ధి చేయాలని లక్ష్యసాధన తో నందికొట్కూరు శాసనసభ్యులు కూటమి పాలనలో విజయం సాధించిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య కు సిద్దేశ్వరం బలపాల తిప్ప, జానాల గూడెం తీర ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత మూడు రోజుల క్రితం నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం కొత్తపల్లి మండల పరిధిలోని జానాల గూడానికి అర్థ శతాబ్దం నుండి ఆ గ్రామానికి బస్సు సౌకర్యం లేక విద్య, వైద్యం కోసం 8 కిలోమీటర్లు నడవాల్సి వచ్చేది 48 ఏళ్లుగా బస్సు ఎరగని ఆ తీర గ్రామ ప్రజలకు స్థానిక శాసనసభ్యులు అండగా నిలిచి పల్లె వెలుగు బస్సు రావటంతో తీరా గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన ఊరు మీద ఉన్న మమకారంతో ఎటువంటి మౌలిక వసతులు లేకున్నా ఓ పక్క దట్టమైన నల్లమల అడవులు మరోపక్క కృష్ణమ్మ పరవళ్ళు మధ్య నది తీరా ప్రాంతానికి ఎగువన గుడిసెలు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీరా గ్రామ ప్రజల సమస్యలు దృష్టిలో ఉంచుకొని రవాణా సౌకర్యం కోసం రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయటంతో ఎట్టకేలకు ఆ గ్రామానికి అధికారులు



బస్సులు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామానికి వచ్చిన బస్సుకు గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. సంతోషానికి అవధులు లేకుండా 48 ఏళ్లుగా చీకట్లో మగ్గిన తమ కుటుంబాలకు బస్సు సౌకర్యం రాకతో మా బ్రతుకులు మారాయి అంటూ హర్షం వ్యక్తం చేశారు.

## ఇందిరేశ్వరం గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ



ఆత్మకూరు జులై 22 వార్త సాక్ష్యం

ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు మాదిగ, ఎంఎస్పి ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు చిలక రాబిన్సన్ మాదిగ సూచనల మేరకు ఆత్మకూరు మండల పరిధిలోని ఇంద్రేశ్వరం గ్రామంలో బుధవారం ఆత్మకూరు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు వనమాల పుల్లయ్య మాదిగ ఆధ్వర్యంలో గ్రామ నాయకుల సమక్షంలో 32వ ఎంఆర్పిఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎంఆర్పిఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు ఇంచార్జి భాష పోగుల దరగయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మదనపల్లె బుజ్జి మాదిగ, నియోజకవర్గం ఎంఎస్పి నాయకులు రామారావు మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధించడం కోసం సుదీర్ఘంగా 32 సంవత్సరాలు పోరాటం కొనసాగించారని పేర్కొన్నారు. వర్గీకరణ ఫలాలు మాదిగ జాతి బిడ్డలు అందుకోవడానికి కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎమ్మార్పీఎస్ నాయకులు వి.శ్రీనివాసులు, జనార్ధన్ మాదిగ,భాస్కర్ మాదిగ, దేవ సహాయం మాదిగ, ముంతన్న మాదిగ, రంగస్వామి మాదిగ, పుల్లన్న మాదిగ,దాసు మాదిగ, కె.లింగస్వామి మాదిగ, కె మల్లయ్య మాదిగ, రాజశేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ పనులు వేగవంతంగా చేపట్టాలి

**– జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా.**

కరీంనగర్.జూలై 22 వార్త సాక్ష్యం



జిల్లాలో చేపట్టిన కీలక సాగునీటి, రైల్వే, రహదారి అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను యుద్ధప్రాతి పదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా రెవెన్యూ, ఇరిగేషన్‌తో పాటు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించాలని స్పష్టం చేశారు.బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రెవెన్యూ, ఇరిగేషన్, భూ సేకరణ విభాగం,నేషనల్ హైవేస్ అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సమీక్షలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, మిడ్ మానేరు, గౌరవెల్లి రిజర్వాయర్ కాలువలు, కాకతీయ కాలువ, కాలేశ్వరం ప్రాజెక్టు, కొత్తపల్లి--మనోహరాబాద్ రైల్వే లైన్ కరీంనగర్ మానేరు రివర్ ఫ్రంట్ తదితర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనుల పురోగతిని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత మేర భూసేకరణ పూర్తయింది, ఎంత పెండింగ్‌లో ఉంది, ఎదురవుతున్న సమస్యలు ఏమిటి, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కరీంనగర్--జగిత్యాల ఫోర్‌లేన్ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పురోగతిపై ఆరా తీశారు. ఇప్పటివరకు ఎంత సేకరించారు., ఇంకా ఎంత మిగిలి ఉంది, పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయని వివరాలు తెలుసుకున్నారు. కొత్తపల్లి--మనోహరాబాద్ రైల్వే లైన్ భూసేకరణ, రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్‌ఓబీలు) నిర్మాణానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రాజెక్టుల ప్రభావిత రైతులకు, నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు ఆలస్యం కాకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంకా ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తికాని ప్రాంతాల్లో వెంటనే సర్వే చేపట్టి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, ఎప్పటికప్పుడు కౌంటర్లు దాఖలు చేసి వివాదాలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులు, పునరావాసం (ఆర్ అండ్ ఆర్) వంటి అంశాలను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. భూములు, ఇళ్లు కోల్పోతున్న రైతులు, ప్రజలకు నిబంధనల ప్రకారం సకాలంలో పరిహారం అందించి, పునరావాస చర్యలను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ఆలస్యం జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, భూ సేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, కరీంనగర్ ఆర్డీవో షర్మిల, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
గురువారం 23 జూలై 2026

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



నిజామాబాద్, జూలై 22వార్త సాక్ష్యం

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ సందర్భంగా గిర్‌రాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిజామాబాద్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈగల్ ఫోర్స్ డీఎస్పీ సోమనాథం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, మంచి స్నేహాలను ఎంచుకుని విద్య, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్-ఫ్రీ తెలంగాణ లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన కార్యక్ర మాలు, కఠిన అమలు చర్యలను సమర్థవంతంగా కొనసాగిస్తోందని తెలిపారు. కేవలం సరదాగా మాదకద్రవ్యాలను ఒకసారి వినియోగించినా అది వ్యసనానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాబోయే ఐదు నుంచి ఏడు సంవత్సరాలను విద్య, నైపుణ్యాభివృద్ధికి అంకితం చేసి, స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని, సానుకూల స్నేహ వాతావరణాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. మాదకద్రవ్యాల వ్యసనం ఆరోగ్యం, విద్య, ఉపాధి, కుటుంబ జీవితాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. రామ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి రాయబారులుగా మారాలని పిలుపునిచ్చారు. తోటి వారి ఒత్తిడికి లొంగకుండా కుటుంబ సభ్యులు, సమాజంలో అవగాహన కల్పించాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా ప్రతీ ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. డ్రగ్-ఫ్రీ తెలంగాణ సాధనలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని కోరారు. ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్, సీబీసీ శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, వాటి వల్ల ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలు, ఆరోగ్య సమస్యలపై యువతలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. "డ్రగ్స్‌కు నో... జీవితానికి యెస్" అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి ఆచరణలో పెట్టి నషా ముక్త్ భారత్ అభియాన్ విజయవంతానికి సహకరించాలని పిలుపునిచ్చారు. డ్రగ్ మాఫియా ప్రధానంగా యువతనే లక్ష్యంగా చేసుకుంటుందని, అందువల్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకురాలు నహీదా బేగం, అధ్యాపకులు, ఆకాశవాణి ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్ మోహన్ దాస్ , విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం -- యువతే సమాజానికి మార్గదర్శకులు: జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్

మహబూబ్ నగర్ జూలై 22వార్త సాక్ష్యం



తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఎస్‌వీఎస్ డెంటల్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌వీఎస్ డెంటల్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి అవగాహన సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో పాటు ప్రత్యేక అవగాహన వీడియోలను ప్రదర్శిస్తూ మాదకద్రవ్యాల బారిన పడిన వ్యక్తుల జీవితాలు ఎలా నాశనమవుతాయో, కుటుంబాలు, స్నేహితులు, సమాజంపై వాటి ప్రభావం ఎలా ఉంటుందో విద్యార్థులకు వివరించారు. అనంతరం జిల్లా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ యువత తమ భవిష్యత్తును నిర్మించుకునే కీలక దశలో మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వ్యసనం కారణంగా వ్యక్తి తన ఆరోగ్యం, కుటుంబం, స్నేహితులు, విద్య, ఉపాధి అవకాశాలు, సమాజంలో గౌరవం వంటి అమూల్యమైన అంశాలను కోల్పోతాడని తెలిపారు. ప్రతి విద్యార్థి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడే బాధ్యతను స్వీకరించి, మరొకరికి కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఎవరైనా మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా లేదా రవాణా చేస్తున్నా వెంటనే 1908 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వారిని శిక్షించడం కాకుండా, అవసరమైతే డి-అడిక్షన్ సెంటర్లకు పంపించి తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. అలాగే జూన్ 26, 2026న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ ఈగల్ ఫోర్స్ వారు నిర్వహించిన పోటీలలో పాల్గొన్న కళాశాల విద్యార్థిని విద్యార్థులకు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా విశేష ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మరియు బ్రోన్జ్ మెడల్ అందజేయడమే కాకుండా ఈ పోటీలలో పాల్గొన్న మిగతా విద్యార్థినీ విద్యార్థులకు తెలంగాణ ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ శ్రీ సందీప్ శాండిల్య ఐపీఎస్ గారి అప్రసియేషన్ లెటర్ మరియు యాంటీ డ్రగ్ సోల్జర్స్ సర్టిఫికెట్స్ ప్రధానం చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ ఈగల్ ఫోర్స్ డీఎస్పీ ఎన్.బుచ్చయ్య, ఎస్‌వీఎస్ వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, ప్రిన్సిపల్ దామోదర్ రెడ్డి, అధ్యాపకులు, రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, ఈగల్ ఫోర్స్ సభ్యులు మరియు సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

**-ఈ నెల 24 న జరిగే రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్ ను జయప్రదం చేయండి**

**-ఆర్ఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి వై .మాధవ్**

నంద్యాల జూన్ 22 వార్త సాక్ష్యం



నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ కావడం సాధారణ పరిపాలనా వైఫల్యం కాదని,ఇది లక్షలాది మంది విద్యార్థుల కష్టం, ఆశయాలు, భవిష్యత్తుపై జరిగిన బహిరంగ దాడి అని ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న విద్యాసంస్థల బంధువులు జయప్రదం చేయాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరమ్ (ఆర్ఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి వై . మాధవ్ పిలుపునిచ్చారు బుధవారం నంద్యాలలో ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షల వ్యవహారంలో ఢిల్లీలో విద్యార్థుల పైన జరిగిన పోలీసుల దాడిని నిరసిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని బంద్ ను నిర్వహిస్తున్నామని అన్నారు. నీట్ పరీక్షకు సన్నద్ధం అయ్యే విద్యార్థులు రాత్రింబవళ్లు శ్రమించి పరీక్షలకు సిద్ధమైన విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన కేంద్ర ప్రభుత్వం ఈ ఘోర వైఫల్యానికి పూర్తి బాధ్యత వహించాలన్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విశ్వసనీయత, భద్రతను కాపాడాల్సిన కేంద్ర విద్యాశాఖ పూర్తిగా విఫలమైందన్నారు దేశ యువత నమ్మకాన్ని తాకట్టు పెట్టిన ప్రభుత్వం అధికారంలో కొనసాగడం సిగ్గుచేటు. నైతిక విలువలు ఉంటే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఒక్క క్షణం కూడా పదవిలో కొనసాగే హక్కు లేదన్నారు. వెంటనే రాజీనామా చేసి విద్యార్థి సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఒకవైపు విద్యార్థులు తీవ్ర ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడుతున్నా, మరోవైపు పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి, లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తును బలి చేస్తున్న పాలకుల వైఖరి అత్యంత ప్రమాదకర అన్నారు. విద్యను కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టి, పరీక్షలను అవినీతి మాఫియాల చెరలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వ విధానాలను దేశ విద్యార్థి లోకం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థి సంఘాలు ఇచ్చిన విద్యా సంస్థల బంద్ పిలుపును నంద్యాల జిల్లా వ్యాప్తంగా సంపూర్ణంగా విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎఫ్ పిలుపునిస్తోంది. విద్యార్థులు, యువజనులు, అధ్యాపకులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు గట్టి హెచ్చరిక పంపాలని ఆర్ఎస్ఎఫ్ కోరుతోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడే పాలకులకు విద్యార్థి ఉద్యమమే సరైన సమాధాన అవుతుందన్నారు కడప జిల్లాలోబంద్‌ను జయప్రదం చెయ్యండి అని నంద్యాల జిల్లా కార్యదర్శి వై .మాధవ్ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మాధవ్, నాయకులు నవీన్, చైతన్య, మహేంద్రా, పండు, అజిత్ కుమార్, ప్రణయ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీశైల పుణ్యక్షేత్రంలో హుండీల లెక్కింపు







శ్రీశైలం జులై 22 వార్త సాక్ష్యం

దేశంలోనే ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తాదులు చెల్లించిన హుండీల లెక్కింపు బుధవారం దేవదాయ శాఖ పర్యవేక్షణ అధికారి ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు చేశారు భక్తులు చెల్లించిన ద్వారా దేవస్థానానికి రూ. 5,06,97,110 / లు నగదు రాబడిగా లభించింది. ఈ హుండీల రాబడిని భక్తులు గత 30 రోజులలో సమర్పించడం జరిగింది. అలాగే ఈ హుండీలో 91 గ్రాముల 300 మిల్లీగ్రాముల బంగారు, 3 కేజీల 160 గ్రాముల వెండి లభించాయి. అదేవిధంగా 1353 - యుఎస్ఏ డాలర్లు, 200-- యు.ఏ.ఇ దిర్హమ్స్, 4 - సింగపూర్ డాలర్లు, 120 -- ఇంగ్లాండు పౌండ్స్, 272 -- మలేషియా రింగిట్స్, 10 -- యూరోస్, 5 - కెనడా డాలర్లు, 50 -- సౌత్ ఆఫ్రికా రాండ్స్ మొదలైనవి ఈ హుండీల లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది. ఈ హుండీల లెక్కింపును కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు పర్యవేక్షించారు. హుండీల లెక్కింపులో ధర్మకర్తల మండలి సభ్యులు కె. కాంతివర్ధిని, డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఎస్. చంద్రశేఖర్ హుండీల లెక్కింపును పాల్గొన్నారు. అదేవిధంగా హుండీల లెక్కింపులో పలువిభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, దేవస్థానం సిబ్బంది శివసేవకులు పాల్గొన్నారు

# శ్రీశైలం పుణ్యక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు










శ్రీశైలం జులై 22 వార్త సాక్ష్యం

శ్వేత నాట్య అకాడమీ, మార్కాపురం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం బుధవారం ఆలయ నిర్వహణ అధికారులు ఏర్పాటు చేశారు ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంకాలం నుండి నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు సంస్కృతిక కార్యక్రమా లలో భాగంగా వినాయకకౌత్వం, శివతాండవం, భో...శంభో, శివాష్టకం, వినాయకస్తుతి, మూహిక ాహన, లింగాష్టకం, శంభో..శివశంభో, నమశ్శివా యతే తదితర గీతాలకు భవిష్య, హరిక, అవిజ్ఞ, మేఘన, శర్వాణి తదితరులు నృత్యప్రదర్శన చేశారు. నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ స్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించారు

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/29/A9153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## ఈ నెల 24,25 తేదీల్లో 'యంగ్ ఎర్త్ లీడర్స్' రెండు రోజుల పర్యావరణ శిక్షణ కార్యక్రమం

**-పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములుగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**-కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి పిలుపు**

జులై 22 వార్త సాక్ష్యం :



విద్యార్థులలో పర్యావరణంపై అవగాహన, బాధ్యతను పెంపొందించాలనే లక్ష్యంతో డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ మరియు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సీజీఆర్) ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లాలో ఎంపిక చేసినప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఈ నెల 24,25 తేదీల్లో రెండు రోజుల పాటు యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రామ్ శిక్షణ కార్యక్రమాన్ని తొర్రూర్ వందేమాతరం ఫౌండేషన్ నితిన్ భవన్ లో నిర్వహించనున్నట్లు కౌన్సిలింగ్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి నాంది పలుకుతూ ఇటీవల మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రామ్ను జిల్లా కలెక్టర్ శశాంక అధికారికంగా ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటగా,అనంతరం వారికి యంగ్ ఎర్త్ లీడర్లకు బ్యాడ్జీలను ప్రదానం చేసి పర్యావరణ పరిరక్షణకు నాయకులుగా పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారన్నారు. యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన పాఠశాలల్లో ఔషధ మొక్కల తోట,కిచెన్ గార్డెన్,వాటర్ హార్వెస్టింగ్ పిట్,కంపోస్ట్ పిట్ ల ఏర్పాటుతో పాటు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు కార్యక్రమాలు నిర్వహించారని,గత రెండేళ్లుగా ఉమ్మడి వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో కాకతీయ వన చైతన్య యాత్రతో పాటు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చామని పేర్కొన్నారు. వాటి కొనసాగి ంపుగానే భవిష్యత్ తరాలను ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములుగా తీర్చిదిద్దేందుకు యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రామ్ను చేపట్టినట్లు వివరించారు. ఈ శిక్షణలో పాల్గొనే విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యం,వాతావరణ మార్పులు,గాలి,నీరు,నేల కాలుష్య నివారణ, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు,మొక్కల ప్రాధాన్యత, ప్రకృతి సంరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యత వంటి అంశాలపై నిపుణులు సమగ్ర అవగాహన కల్పించనున్నారు. అలాగే నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత,బృంద నిర్వహణ నైపుణ్యాలపై కూడా శిక్షణ ఇవ్వనున్న ట్లు తెలిపారు. ఈ రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఎంపికైన యంగ్ ఎర్త్ లీడర్స్ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.

## వీబీజీ రామ్ జీ ద్వారా నీటి సంరక్షణ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**-ఆగస్టు 1 నుంచి పంట కుంటలు, ఇంకుడు గుంతలు, బోరు రీఛార్జ్ నిర్మాణ పనులు ప్రారంభించాలి**

**-సూపర్ ఎల్నినో పరిస్థితుల్లో ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టుకుని భవిష్యత్తును కాపాడాలి**

**-తెలంగాణ జలసిరి, వీబీజీ రామ్ జీ అమలు పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**

జులై 22 వార్త సాక్ష్యం:

సూపర్ ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలను పరిరక్షించడం అత్యంత ప్రాధాన్యమని, తెలంగాణ జలసిరి కార్యక్రమం, వీబీజీ రామ్ జీ పథకం ద్వారా నీటి సంరక్షణ నిర్మాణాలను గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో తెలంగాణ జలసిరి కార్యక్రమం, వీబీజీ రామ్ జీ పథకం అమలు పై ఎంపీడీవోలతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల్లో చేపట్టాల్సిన నీటి సంరక్షణ పనులు, స్థలాల గుర్తింపు, పరిపాలనా అనుమతులు, పనుల ప్రారంభంపై అధికారులకు పలు దిశానిర్దేశాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న వీబీజీ రామ్ జీ పథకాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణకు సంబంధించిన నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. భవిష్యత్ నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామంలో ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో పంట కుంటలు, ఇంకుడు గుంతలు, ఊట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఇందుకోసం అవసరమైన స్థలాలను వెంటనే గుర్తించి, పనులకు అవసరమైన పరిపాలనా అనుమతులు మంజూరు చేసి, ఆగస్టు 1వ తేదీ నుంచి నిర్మాణ పనులు ప్రారంభించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. సూపర్ ఎల్నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టే విధంగా నీటి సంరక్షణ చర్యలను మిషన్ మోడ్లో అమలు చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.




భూగర్భ జలాలను పెంపొందించే ప్రతి అవకాశాన్ని వినియోగించుకొని భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నీటి సంరక్షణ నిర్మాణాల అమలులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పనులు నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామపంచాయతీలు, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నరేందర్,డి.ఆర్.డి.ఓ. కాళిందిని,జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలి

**-వర్షాభావంలో శాస్త్రీయ యాజమాన్యంతో పంటలను కాపాడాలి**

**-పోడు రైతులపై ప్రత్యేక దృష్టి... ఫార్మర్ రిజిస్ట్రీ వేగవంతం చేయాలి**

**-వ్యవసాయ అధికారులు,కేవీకే శాస్త్రవేత్తలతో జిల్లా కలెక్టర్ రాజర్షి షా జూమ్ సమీక్ష**

జులై 22 వార్త సాక్ష్యం :

జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. శాస్త్రీయ సాగు విధానాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించి, పంటలను నష్టాల నుంచి కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఎరువుల సరఫరా,ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేయడంతో పాటు పోడు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.కలెక్టరెట్ నుండి జిల్లా వ్యవసాయ అధికారులు,మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు,కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలతో నిర్వహించిన జూమ్ సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామగోపాల్ వర్మ ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతులు అనుసరించాల్సిన శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను వివరించారు.రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా అన్ని ఎరువుల దుకాణాల్లో తగిన నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అవసరమైతే టోకెన్ లేదా ముందస్తు నమోదు విధానాన్ని అమలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు అందించాలని చెప్పారు. పోడు రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని,భూ వివాదాలు లేని అర్హులైన రైతులకు రైతు భరోసా వర్తించేలా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేసి, నమోదు పూర్తికాని మండలాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో రైతులకు ప్రభుత్వ పథకాలు,శాస్త్రీయ సాగు విధానాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచిం చారు. జూలై 20తో పత్తి విత్తనాల గడువు ముగిసినందున ఇకపై పత్తి విత్తకూడదని శాస్త్రవేత్తలు సూచించారు. ఇప్పటికే వేసిన పత్తి పంటలో ఖాళీలు ఉంటే 7 నుంచి 10 రోజుల్లోపు పూరించాలని, వర్షాభావ పరిస్థితుల్లో ఫోలియర్ స్ప్రే ద్వారా పోషకాలు అందించాలని తెలిపారు. సోయాబీన్, కంది, మొక్కజొన్న పంటల్లో కలుపు, తెగుళ్ల నివారణకు వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన మందులనే వినియోగించాలని సూచించారు. మొక్కజొన్న పంటను జూలై 31 వరకు విత్తుకోవచ్చని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో అంతరకృషికి



ప్రాధాన్యం ఇవ్వాలని, యూరియా వినియోగాన్ని పరిమితం చేసి అవసరమైన చోట నానో యూరియా, నానో డీఏపీ లేదా 19-19-19 ద్రావణాన్ని ఆకులపై పిచికారీ చేయాలని సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించడంతో పాటు,భవిష్యత్తులో వర్షాభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు వ్యవసాయ కుంటలు, కందకాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కేవీకే శాస్త్రవేత్తల సూచనలను ప్రతి గ్రామంలోని రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతులకు వ్యవసాయ సంబంధిత సందేహాలు ఉంటే వ్యవసాయ శాఖ హెల్ప్లైన్ 8977742855ను సంప్రదించాలని సూచించారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి 'స్త్రీ నిధి' చేయూత

**-జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

జులై 22 వార్త సాక్ష్యం :

గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికంగా నిలదొక్కు కోవడానికి, వారి సాధికారతకు 'స్త్రీ నిధి' రుణాలు ఎంతో దోహదపడుతున్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్త్రీ నిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్' జిల్లా సమీక్షా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... స్వయం సహాయక సంఘాల మహిళలు కేవలం రుణాల వినియోగానికే పరిమితం కాకుండా, చిన్న తరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని ఆర్థికంగా ముందుకు



సాగాలని ఆకాంక్షించారు. అర్హులైన ప్రతి మహిళా సంఘానికి సకాలంలో రుణాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా స్త్రీ నిధి ద్వారా అందించిన ఆర్థిక సహాయం, రుణాల పంపిణీ, రికవరీ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా సమీక్షించారు. అధికారులు, ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మహిళల




సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డిఆర్డిఓ రవీందర్, మెప్మా పిడీ రాజు, స్త్రీ నిధి జిల్లా ప్రతినిధులు, మండల సమాఖ్య ప్రతినిధులు,స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాక్రోజ్-దేశ ద్రోహుల పార్టీ -నీట్ పేరుతో దేశ వ్యతిరేక కలాపాలు

**-ప్రజాస్వామ్యం ముసుగులో ప్రజల్ని రెచ్చగొడుతున్నారు**

**-రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దహనం**

జులై 22 వార్త సాక్ష్యం :

కాక్రోజ్ పార్టీ, దానికి మద్దతు తెలుపుతున్న పార్టీలు, నాయకులు దేశద్రోహ కార్యకలాపాలకు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ధ్వజమెత్తారు. ప్రధాని నివాసం వద్ద అరాచకం సృష్టించిన కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బుధవారం నగరంలోని నిఖిల్ సాయి చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఒకప్పుడు ఆప్ పార్టీ సోషల్ మీడియా వాలంటీర్ గా పని చేశాడని గుర్తు చేశారు. ఒకవైపు ప్రపంచ దేశాల్లో భారత్ ఆగ్రహానికి నిలబడితే, కాంగ్రెస్ మాత్రం అధికారం కోసం అరాచక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. దేశ ప్రధాని మోదీ అభివృద్ధి పాలన చూడలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతు ందని మండిపడ్డారు. కాక్రోచ్ పార్టీకి మద్దతు తెలుపుతున్న నాయకులంతా దేశద్రోహులేనని ధ్వజమె త్తారు. దీక్ష చేపట్టిన సోనమ్ వాంగ్ చుగ్ గతంలో జాతీయ వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టడంతో, ఆయనపై జాతీయ భద్రతా చట్టం కింద కేసు నమోదయిందని తెలిపారు. కాక్రోచ్ పార్టీకి మద్దతు తెలిపే ప్రతి ఒక్కరూ బంగ్లాదేశ్ కి పాకిస్తాన్ కి మద్దతు తెలుపుతూ దేశ వ్యతిరేకులుగా మిగిలిపోతున్నారన్నారు. మమతా బెనర్జీ, స్టాలిన్, అద్దంకి దయాకర్, ప్రకాష్ రాజ్.. ఇలా చెప్పుకు ంటూ పోతే అనేక మంది హిందూ వ్యతిరేకులు ఏకమవు తున్నారని చెప్పారు. నీట్ పరీక్ష పేరుతో ఢిల్లీలో అరాచకం సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నీట్ లీకేజీ పై కేంద్ర ప్రభుత్వం సీరియస్ గా ఉందన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని గుర్తు చేశారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. విద్యార్థుల పాఠ్యాంశాల్లో అక్బర్, ఔరంగజేబు వంటి వారి చరిత్రను తొలగించినందుకా అని అన్నారు.



అంతకు ముందు పోలీసులు దిష్టి బొమ్మ దహనాన్ని అడ్డుకోవడంతో కొంత తోపులాట జరిగింది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్కార్ లక్ష్మీనారాయణ, నాగోల్ల లక్ష్మీనారాయణ, ఎర్రం సుధీర్, ఇప్పకాయల కిషోర్, చింతకాయల రాజేందర్, బెల్లాల్ శశాంక్, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, న్యాలం సునీత రాజు, బంటు ప్రీతి ప్రవీణ్, మండలాధ్యక్షులు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అరెస్టులతో విద్యార్థులను, రాహుల్ గాంధీ ని అడ్డుకోలేరు : దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్

జులై 22 వార్త సాక్ష్యం :



చిన్నచింతకుంట మండలం లాల్ కోట ఐ తీఋుస రాయి చూర్ హైవేపై దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ.జి. మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ....నీట్ (NEET-UG) పేపర్ లీక్ వ్యవహారానికి వ్యతిరేకంగా, ఢిల్లీలో విద్యార్థులకు మద్దతుగా ఆందోళన చేపట్టిన లోక్సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడాన్ని మరియు విచక్షణారహితంగా విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేయడాన్ని, టియర్ గ్యాస్ ప్రయోగించడానికి నిరసిస్తూ పెద్ద ఎత్తున నిరసన (ధర్నా) కార్యక్రమం నిర్వహించి, దిష్టిబొమ్మ దగ్ధం చేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరియు మోడీ కి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేసిన కాంగ్రెస్ శ్రేణులు. అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ..నీట్ (NEET) పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం అమానుషమని దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా , ప్రధాని మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీ , కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వా మ్యానికి విరుద్ధమని విమర్శించారు, నీట్ పరీక్షల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.



వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బిజినెస్

## భారత్‌లో ఐఫోన్ 17దే హవా

## యాపిల్ అమ్మకాలలో 44 శాతం వాటా



భారత్‌లో 2026 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో యాపిల్‌కు చెందిన ఐఫోన్ 17 సిరీస్ అత్యధికంగా అమ్ముడైన స్మార్ట్‌ఫోన్‌గా నిలిచింది. ఈ సిరీస్ ఒక్కటే కంపెనీ మొత్తం ఐఫోన్ సరఫరాల్లో 44 శాతం వాటాను దక్కించుకున్నట్లు సైబర్ మీడియా రీసెర్చ్ (సీఎంఆర్) వెల్లడించింది. సీఎంఆర్ నివేదిక ప్రకారం.. ఐఫోన్ 16 సిరీస్ 40 శాతం వాటాతో రెండో స్థానంలో నిలిచింది. ఇక ఐఫోన్ 17ఈ 6 శాతం, ఐఫోన్ 16ఈ 5 శాతం, ఐఫోన్ 15 సిరీస్ 4 శాతం షిప్‌మెంట్‌లను నమోదు చేశాయి. కొత్త మోడళ్లు వచ్చినప్పటికీ ఐఫోన్ 15 సిరీస్‌కు ఇంకా మార్కెట్‌లో ఆదరణ కొనసాగుతున్నట్లు నివేదిక పేర్కొంది. ఐఫోన్ 18 సిరీస్ విడుదలకు ముందు ఏప్రిల్-జూన్ త్రైమాసికం సాధారణంగా యాపిల్‌కు మందగమన కాలమని, ఈసారి మెమరీ చిప్‌ల కొరత కూడా షిప్‌మెంట్లపై ప్రభావం చూపిందని సీఎంఆర్ విశ్లేషించింది. అయితే పండగల సీజన్‌లో యాపిల్ మళ్లీ జోరు పెంచే అవకాశం ఉందని అంచనా వేసింది. కంపెనీ తొలి ఫోల్డబుల్ ఐఫోన్ విడుదలతో అమ్మకాలు మరింత పెరిగే అవకాశముందని పేర్కొంది. 2026 చివరి నాటికి భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో యాపిల్ వాటా 12 శాతానికి, ట్యాబ్లెట్ మార్కెట్లో 30 శాతానికి చేరే అవకాశముందని సీఎంఆర్ అంచనా వేసింది.

## క్లెయిమ్ చేయని ఎల్ఐసీ, ఈపీఎఫ్ నిధులు ఇతర అవసరాలకు వాడబోం: కేంద్రం




ఎల్ఐసీలో క్లెయిమ్ చేయకుండా మిగిలిపోయిన నగదు, ఈపీఎఫ్ఓలోని నిర్వీర్య (ఇనాపరేటివ్) ఖాతాల్లో ఉన్న నిధులను ఇతర అవసరాలకు వినియోగించే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం ప్రకారమే ఈ నిధులను నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. 2024 జూన్ 19న ఐఆర్‌డీఏఐ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం.. పదేళ్లకు పైగా క్లెయిమ్ చేయని బీమా మొత్తాలను సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ ఫండ్ (ఎస్‌సీడబ్ల్యూఎఫ్)కు బదిలీ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. 2026 మార్చి 31 నాటికి ఎల్ఐసీలో మొత్తం రూ.7,318.50 కోట్లు క్లెయిమ్ చేయని నిధులు ఉన్నాయని వెల్లడించారు. ఇందులో పాలసీదారులకు చెందిన రూ.5,564.55 కోట్లు, వాటిపై వచ్చిన ఆదాయం రూ.1,753.95 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈపీఎఫ్ఓలో క్లెయిమ్ చేయని ఖాతాలు ఏవీ లేవని, అయితే లావాదేవీలు లేక నిర్వీర్యంగా మారిన ఖాతాల్లో రూ.9,330.56 కోట్లు ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. ఈ నిధుల అసలైన లబ్ధిదారులను గుర్తించి వారికి అందించేందుకు ఎల్ఐసీ, ఈపీఎఫ్ఓ ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని వివరించింది. ఎల్ఐసీ తన వెబ్‌సైట్ ద్వారా క్లెయిమ్ చేయని మొత్తాలను తెలుసుకునే అవకాశం కల్పించడంతో పాటు ఎస్ఎంఎస్‌లు, లేఖలు, ఏజెంట్లు, బీమా సఖీల ద్వారా పాలసీదారులు, నామినీలను సంప్రదిస్తోందని ప్రభుత్వం తెలిపింది. మరోవైపు ఆధార్‌తో అనుసంధానమైన రూ.1,000లోపు నిర్వీర్య ఈపీఎఫ్ ఖాతాలను ఆటోమేటిక్‌గా సెటిల్ చేసే పైలట్ ప్రాజెక్టును కూడా ఈపీఎఫ్‌వో ప్రారంభించినట్లు వెల్లడించింది.

## ఆరు వారాల గరిష్ఠానికి ముడి చమురు- 95 డాలర్లు దాటిన బ్రెంట్ క్రూడ్



అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మరోసారి భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర గత ఆరు వారాల్లో తొలిసారిగా బ్యారెల్‌కు 95 డాలర్ల మార్కును అధిగమించింది. ప్రపంచ ఇంధన మార్కెట్లో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సరఫరా సంబంధిత ఆందోళనలు, మారుతున్న డిమాండ్ పరిస్థితులే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిణామాలు, ప్రధాన చమురు ఉత్పత్తి దేశాలు ఉత్పత్తిలో సర్దుబాట్లు చేయడం వంటివి ధరల పెరుగుదలకు దారితీశాయి. ఇది చమురు మార్కెట్లలో మళ్లీ అస్థిరతను సూచిస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇరాన్ మిలిటరీ స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు కొనసాగిస్తుండటంతో, ప్రతిగా ఇరాన్ కూడా బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై దాడులకు పాల్పడుతోంది. దీనికి తోడు యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారులు సౌదీకి సంబంధించిన నౌకలను దిగ్బంధనం చేస్తామని హెచ్చరించడంతో, ఆయిల్ ట్యాంకర్లు తమ రవాణా మార్గాలను మార్చుకుంటున్నాయి. ముడి చమురు ధరల పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం, రవాణా ఖర్చులపై నేరుగా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇంధన దిగుమతులపై ఆధారపడిన దేశాల ఆర్థిక వ్యవస్థలకు ఇది సవాలుగా మారనుంది. ఈ నేపథ్యంలో వివిధ దేశాలు ప్రభుత్వాలు,పారిశ్రామిక వర్గాలు మార్కెట్ కదలికలను నిశితంగా గమనిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఒపెక్ం దేశాలు తీసుకోబోయే నిర్ణయాలు, అంతర్జాతీయ ఆర్థిక సంకేతాలపై చమురు ధరల గమనం ఆధారపడి ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## గిల్‌కు 70 పరుగుల వద్దే కండరాలు పట్టేస్తున్నాయి: స్టువర్ట్ బ్రాడ్

ఇంటర్నెట్ డెస్క్:

భారత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఫిట్‌నెస్‌పై ఇంగ్లండ్ క్రికెట్ దిగ్గజం స్టువర్ట్ బ్రాడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో గిల్ బ్యాటింగ్‌తో అదరగొట్టినప్పటికీ.. కీలక సమయంలో కండరాలు పట్టేయడంపై ప్రశ్నలు లేవనెత్తాడు. 70 పరుగుల చేసిన తర్వాతే గిల్‌కు క్రాంప్స్ ఎందుకు వస్తున్నాయో అర్థం కావడం లేదని వెల్లడించాడు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో భారత్ 1-2తో ఓడిపోయినప్పటికీ, గిల్ బ్యాట్‌తో అద్భుత ప్రదర్శన చేశాడు. మూడు మ్యాచ్‌ల్లో రెండు అర్ధ సెంచరీలు సాధించాడు. అయితే తొలి, మూడో వన్డేల్లో 70 పరుగుల మార్కు దాటిన తర్వాత అతడికి క్రాంప్స్ సమస్య ఎదురవ్వడం గమనార్హం.ప్రతిసారి శుభ్‌మన్ గిల్ 70 పరుగుల మార్క్ దాటగానే క్రాంప్స్‌తో ఇబ్బంది పడుతున్నాడు. తొలి, మూడో వన్డేల్లో అతని రిథమ్ దెబ్బతింది. అయితే గిల్ వన్డే గణాంకాలు అద్భుతం. బర్మింగ్‌హామ్‌లో అతని రికార్డును తెరపై చూసినప్పుడు సగటు దాదాపు 60గా కనిపించింది. మొదట నమ్మలేక మరోసారి చూసుకోవాల్సి వచ్చింది. అది 10 మ్యాచ్‌ల్లో సాధించిన రికార్డు కాదు.. ఇన్ని మ్యాచ్‌ల తర్వాత కూడా అదే స్థాయిలో ప్రదర్శన కనబరచడం గొప్ప విషయం' అని బ్రాడ్ ప్రశంసించాడు. 26 ఏళ్ల గిల్ ఇప్పటివరకు 67 వన్డేల్లో 3,379 పరుగులు చేశాడు.




**-నాకు ఆశ్చర్యంగా అనిపించింది: బట్లర్**

గిల్‌తో పాటు ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడే ఇంగ్లండ్ ఆటగాడు జోస్ బట్లర్ కూడా ఈ విషయంపై స్పందించాడు. 'తొలి వన్డేలో గిల్‌కు క్రాంప్స్ వచ్చాయని శ్రేయస్ అయ్యర్ నాకు చెప్పాడు. ఇంగ్లండ్ వాతావరణంలో ఇలా జరగడం ఆశ్చర్యంగా అనిపించింది. ఇది అహ్మదాబాద్‌లోని 40 డిగ్రీల వేడి కాదు. బహుశా ఏదైనా అంతర్గత గాయం ఉండొచ్చు. లార్డ్స్‌లో కీలక సమయంలో అతని వేగాన్ని తగ్గించి, వికెట్ కోల్పోయేలా చేసింది' అని బట్లర్ పేర్కొన్నాడు.

# క్రీడలు

## జింబాబ్వే సిరీస్.. టీమిండియాలో అవకాశం కోసం ఎదురుచూస్తున్నా: అశోక్ శర్మ

ఇంటర్నెట్ డెస్క్:




భారత టీ20 జట్టులో చోటు దక్కడంతో తన జీవితకాల కల నెరవేరిందని యువ పేసర్ అశోక్ శర్మ వెల్లడించాడు. జులై 23 నుంచి 26 వరకు టీమిండియా.. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్ ఆడనున్న సంగతి తెలిసిందే. ఈ సిరీస్‌కు ఎంపికైన అన్‌క్యాప్డ్ ప్లేయర్లలో అశోక్ శర్మ కూడా ఉన్నాడు. హరారే వేదికగా గురువారం తొలి మ్యాచ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో.. అశోక్ శర్మ మాట్లాడాడు. భారత జెర్సీ ధరించి దేశానికి ప్రాతినిధ్యం చేయాలని ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపాడు. భారత జెర్సీ ధరించి దేశానికి ప్రాతినిధ్యం వహించడమే నా తొలి లక్ష్యం. ఆ క్షణం కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నాను. దేశవాళీ క్రికెట్‌లో ఇప్పటివరకు ఎలా కష్టపడ్డానో, అదే విధంగా నా ప్రణాళికలు, సాధనను కొనసాగిస్తాను. నా బలాలపైనే దృష్టి పెడతాను. అనవసరంగా కొత్త ప్రయోగాలు చేయను. జింబాబ్వే సిరీస్‌లో నాకు అవకాశం వస్తే దాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటాను. ఎక్కువ మ్యాచ్‌లు ఆడి ఎక్కువ వికెట్లు తీయాలని ఉంది. ఆ తర్వాత వీలైనంత త్వరగా భారత టెస్టు జట్టుకు ఆడాలనేది నా తదుపరి లక్ష్యం' అని అశోక్ శర్మ పేర్కొన్నాడు.

**-ఇండియా-ఎ నుంచి జాతీయ జట్టుకు..**

గత జూన్‌లో శ్రీలంక పర్యటనకు వెళ్లిన ఇండియా-ఎ జట్టులో అశోక్ శర్మకు అవకాశం లభించింది. ఫీల్డింగ్ సమయంలో గాయపడిన యుధ్వీర్ సింగ్ స్థానంలో అతడిని జట్టులోకి తీసుకున్నారు. ఆ పర్యటనలో లభించిన అనుభవమే ఇప్పుడు జాతీయ జట్టులో చోటు దక్కడానికి ఉపయోగపడిందని భావిస్తున్నారు. తన బౌలింగ్‌కు అతిపెద్ద స్ఫూర్తి దక్షిణాఫ్రికా దిగ్గజ పేసర్ డేల్ స్టెయిన్ అని అశోక్ వెల్లడించాడు. స్టెయిన్ ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని మార్చగల బౌలర్ అని ప్రశంసించాడు. 'డేల్ స్టెయిన్ బౌలింగ్ అంటే నాకు చాలా ఇష్టం. అతని దూకుడు, రన్‌అప్, బ్యాటర్లను ఉచ్చులోకి దించే విధానం అన్నీ నాకు స్ఫూర్తినిస్తాయి. ఫాస్ట్ బౌలర్‌గా నేను అతడినే ఆదర్శంగా తీసుకుంటాను' అని అశోక్ శర్మ చెప్పుకొచ్చాడు.

## టీమిండియాను వెంటాడుతున్న గాయాలు సమన్వయ లోపమే కారణమా?

ఇంటర్నెట్ డెస్క్:

భారత జట్టును కొంతకాలంగా గాయాల బెడద వెంటాడుతోంది. ఇటీవల ఇంగ్లండ్ పర్యటన నిరాశాజనకంగా ముగిసిన అనంతరం వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా ప్లేయర్ల గాయాలపై బహిరం గంగానే అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఆటగాళ్ల ఫిట్‌నెస్, వర్క్ లోడ్ మేనేజ్‌మెంట్ విషయంలో బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ , జట్టు యాజమాన్యం, సపోర్ట్ స్టాఫ్ మధ్య సరైన సమన్వయం లేకపోవడమే దీనికి కారణమని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నట్లు సమాచారం. ఇటీవల ప్లేయర్లు తరచూ గాయాల పాలవుతున్నారు. ఇది చూస్తుంటే కొందరు ఆటగాళ్లు పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించక ముందే బరిలోకి దిగుతున్నట్లు కనిపిస్తోంది. ఆటగాడి ఫిట్‌నెస్ స్థితి, వర్క్ లోడ్‌కు సంబంధించిన విషయాల్లో సమన్వయం లోపించింది' అని బీసీసీఐకి చెందిన ఓ అధికారి వెల్లడించారు. మెడికల్ మాజీ హెడ్ నితిన్ పటేల్ వెళ్లిపోయిన తర్వాత సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ఇప్పటికీ పూర్తి స్థాయి మెడికల్ హెడ్‌ను నియమించలేదని తెలుస్తోంది. 2023లో రూపొం దించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ లోనూ ఎలాంటి మార్పులు చేయలేదని సమాచారం.

**-తరచూ గాయపడుతున్న ప్లేయర్లు..**

వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా వంటి యువ ఆటగాళ్లు తరచూ గాయాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా నితీశ్ రెడ్డి ఇంగ్లండ్‌కు చెందిన బౌలింగ్ కోచ్ స్టెఫాన్ జోన్స్ పర్యవేక్షణలో తన బౌలింగ్ వేగాన్ని పెంచుకునేందుకు ప్రయత్నించడం కూడా చర్చనీ యాం శమైంది. జట్టు అవసరాల దృష్ట్యా ప్రతిసారీ మరింత వేగంగా బౌలింగ్ చేయాలనే ప్రయత్నం చేయడం వల్ల శరీరంపై అదనపు ఒత్తిడి పడుతోందని బీసీసీఐ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. వేగం పెంచే ప్రక్రియను దశలవారీగా అమలు చేయాల్సి ఉండగా, తొందరపాటు వల్ల గాయాల ప్రమాదం పెరిగిందని పేర్కొన్నాయి.



VARTHAA SAKSHAMU వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక RNI Title Code: APTEL/25/A5153 Editor : SAGINALA RAVI KUMAR

గురువారం 23 జూలై 2026

# లోకేశ్ కనగరాజ్ సినిమాలో అల్లు అర్జున్‌కు జోడీగా పూజా హెగ్డే హ్యాట్రిక్ రిపీట్?



‘పుష్ప’ ఫ్రాంచైజీతో పాన్ ఇండియా స్థాయిలో భారీ క్రేజ్ సంపాదించుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, తన తదుపరి ప్రాజెక్ట్‌లతో భారతీయ సినీ పరిశ్రమలో తీవ్రమైన ఆసక్తిని రేకెత్తిస్తున్నారు. ప్రస్తుతం ఆయన లైనప్‌లో ఉన్న చిత్రాలపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో కోలీవుడ్ సంచలన దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో ఓ సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. ‘ AA23’గా ప్రచారంలో ఉన్న ఈ చిత్రం ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉండగానే, దీనికి సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్‌కు జోడీగా పూజా హెగ్డేను తీసుకోనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే, అల్లు అర్జున్-పూజా హెగ్డే కాంబినేషన్‌లో ఇది మూడో చిత్రం అవుతుంది. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన ‘దువ్వాడ జగన్నాథం’,‘అల వైకుంఠపురములో’ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించాయి. ముఖ్యంగా త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన ‘అల వైకుంఠపురములో’ ఇండస్ట్రీ హిట్‌గా నిలవడమే కాకుండా వారి మధ్య కెమిస్ట్రీ, ‘బుట్టబొమ్మ’ పాట దేశవ్యాప్తంగా సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలో ఈ హిట్ పెయిర్ మళ్లీ కలిస్తే అంచనాలు ఆకాశాన్ని తాకడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీతో ‘రాకా’ అనే పాన్





వరల్డ్ ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారు. ఆ తర్వాత లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో ‘ఏఏ23’ పట్టాలెక్కనుంది. లోకేశ్ తన సినిమాల్లో హీరో పాత్రలతో పాటు హీరోయిన్ పాత్రలను కూడా ఎంతో బలంగా, ప్రభావవంతంగా తీర్చిదిద్దుతారనే పేరుంది. ఇటీవల ఆయన దర్శకత్వంలో వచ్చిన ‘కూలీ’ చిత్రంలో పూజా హెగ్డే ‘మోనికా’ పాటలో కనిపించి అలరించడం కూడా ఈ ఊహాగానాలకు బలాన్నిస్తోంది. ఈ క్రేజీ కాంబినేషన్‌ను లోకేశ్ తనదైన మార్క్ ఇంటెన్స్ యాక్షన్‌తో ఎలా చూపిస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే, పూజా హెగ్డే ఎంపికపై సోషల్ మీడియాలో జోరుగా చర్చ జరుగుతున్నప్పటికీ, చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో అభిమానులు ఈ హ్యాట్రిక్ కాంబినేషన్‌పై అధికారిక ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## వారానికి 4 రోజులే పనా.. భారతదేశానికి అది సాధ్యం కాదు: నటుడు విక్రాంత్ మాస్సే

ఉత్తర యూరప్ దేశాల్లో మాదిరిగా వారానికి నాలుగు రోజులే పనిచేసే ‘ఫోర్-డే వర్క్ వీక్’ నమూనా ప్రస్తుతానికి భారతదేశానికి అస్సలు సరిపడదని ప్రముఖ నటుడు విక్రాంత్ మాస్సే అభిప్రాయపడ్డారు. తన రాబోయే వెబ్ సిరీస్ ‘ముసాఫిర్ కేఫ్’ ప్రమోషన్ల సందర్భంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన పనివేళలు, వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌పై తన స్పష్టమైన అభిప్రాయాలను పంచుకున్నారు. మనది ఇంకా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని, యువ ప్రతిభ కలిగిన ఈ ప్రజాస్వామ్య దేశం అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి వచ్చే 40 నుంచి 50 ఏళ్ల పాటు ఎంతో కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు.దముఖ్యంగా వినోద పరిశ్రమ గురించి మాట్లాడిన విక్రాంత్, సినీ నిర్మాణం అత్యంత వ్యయంతో కూడుకున్న వ్యవహారమని వ్యాఖ్యానించారు. షూటింగ్‌లో 12 గంటల షిఫ్ట్ ఉన్నప్పటికీ, నిజానికి కేవలం నాలుగు లేదా ఐదు గంటలు మాత్రమే కెమెరా ముందు పనిచేస్తామని వివరించారు. బడ్జెట్ పరిమితులు, ప్రాక్టికల్ పరిస్థితుల కారణంగా కొన్నిసార్లు 16 నుంచి 17 గంటలు కూడా పనిచేయాల్సి వస్తుందని తెలిపారు. రుచిర్ అరుణ్ దర్శకత్వంలో మహిమా మక్వానా, వేదిక పింటోలతో కలిసి విక్రాంత్ నటించిన ప్రేమకథా చిత్రం ‘ముసాఫిర్ కేఫ్’ జులై 24న నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో విడుదల కానుంది. ఇందులో చందర్ పాత్రలో తన నటన కొత్త భావోద్వేగాలను ఆవిష్కరిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.


## దేశాన్ని అస్థిరపరిచే కుట్ర: ఢిల్లీ అల్లర్లపై సినీ నటుడు నరేశ్

ఢిల్లీలో జరిగిన ‘ఛలో పార్లమెంట్’ నిరసన కార్యక్రమంలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై ప్రముఖ నటుడు నరేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. నిరసనకారులు బారికేడ్లను దాటుకుని పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించడం, పోలీసులు అడ్డుకోవడంతో లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం వరకు వెళ్లిన పరిస్థితులపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిరసనల పేరుతో వాహనాలు ధ్వంసం చేయడం, పోలీసులు, ఆందోళనకారులు గాయపడటం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్ అనేది చాలా తీవ్రమైన అంశమని, ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించి ఉండాల్సిందని నరేశ్ అభిప్రాయపడ్డారు. అయితే పరీక్షలు పూర్తై ఫలితాలు కూడా వచ్చాక ఇలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ ఘర్షణల్లో పోలీసు సిబ్బంది కూడా గాయపడటాన్ని చూస్తుంటే... దీని వెనుక దేశాన్ని అస్థిరపరిచే సంఘవిద్రోహ శక్తుల కుట్ర కోణం ఏమైనా ఉందా? అనే అనుమానాలు కలుగుతున్నాయని... ఈ అంశంపై సమగ్రంగా దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, అయితే హింసకు పాల్పడటం లేదా యువతను తప్పుదోవ పట్టించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదని ఆయన స్పష్టం చేశారు. ఎప్పుడూ దేశ ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం నరేశ్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.



# ‘ది ఈస్ట్ ప్యాలెస్’ (నెట్ ఫ్లిక్స్) సిరీస్ రివ్యూ!

కొరియన్ సినిమాలకు .. సిరీస్ లకు ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ వైపు నుంచి విశేషమైన ఆదరణ లభిస్తోంది. కొరియన్ కథల్లోని బలం .. సహజత్వం .. టేకింగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అందువలన ఓటీటీ సెంటర్లలో కొరియన్ కంటెంట్ హవా నడుస్తోంది. అలా వచ్చిన సిరీస్ గా ‘ది ఈస్ట్ ప్యాలెస్’ కనిపిస్తోంది. నామ్ జూ హ్యూక్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ డార్క్ ఫాంటసీ సిరీస్ ను 8 ఎపిసోడ్స్ గా రూపొందించారు. ఈ నెల 17వ తేదీ నుంచి ‘నెట్ ఫ్లిక్స్’లో తెలుగులోను స్ట్రీమింగ్ అవుతోంది.అది ఒక అందమైన ప్యాలెస్. అక్కడ నుంచే ప్రిన్స్ ‘క్రౌన్’ తన పరిపాలన కొనసాగిస్తూ ఉంటాడు. అతనికంటే ముందున్న రాజుకి నలుగురు వారసులు ఉంటారు. వాళ్లంతా కూడా ఒకరి తరువాత ఒకరు చనిపోతారు. ఆ మరణాలు జరిగిన 30 ఏళ్ల తరువాత ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి పునరావృతమవుతూ ఉంటుంది. క్రౌన్ వారసులు ముగ్గురు చనిపోతారు. నాల్గొవ కుమారుడు (యువరాజు) చావు బ్రతుకుల్లో ఉంటాడు. ఈ వరుస మరణాలకు కారణం ‘కోనేటి దెయ్యం’ అనే అంతా నమ్ముతుంటారు. ‘గు







– చోన్’ ( నామ్ జూ హ్యూక్)కి చిన్నతనం నుంచే కొన్ని అతీంద్రియ శక్తులు వస్తాయి. అందువలన అతనికి దుష్టశక్తులను ఎదుర్కొనగలిగే శక్తి వస్తుంది. ఈ కారణంగా ‘క్రౌన్’ అతనిని పిలిపిస్తాడు. కోనేటి దెయ్యాన్ని అంతం చేసి, తన కొడుకుని బ్రతికిస్తే, అతను కోరినది ఇస్తానని చెబుతాడు. అసలు విషయాన్ని దాచేసి, ‘వాస్తు నిపుణుడు’గా తన ప్యాలెస్ లో చెలామణి కావలసిందిగా ఆదేశిస్తాడు. ప్యాలెస్ కి దూరంగా పెరిగిన కూతురు (యువరాణి)ని పిలిచి, ‘గు –చోన్’కి సహకరిస్తున్నట్టుగా ఉంటూ, అతనిని గమనించమని చెబుతాడు. యువరాణి .. గు – చోన్ ఇద్దరూ కూడా ఆ ప్యాలెస్ లో తిరుగుతూ, పరిస్థితులను పరిశీలించడం మొదలుపెడతారు. ఆ ప్యాలెస్ లో ‘కోనేరు’ చుట్టూ ఏదో రహస్యం ఉందని భావిస్తారు. అలాగే ‘ఉప్పుగని’ ప్రదేశంలోనే ప్రేతాత్మల హడావిడి ఎక్కువగా ఉండటాన్ని గమనిస్తారు. మంత్రించిన కుండల వెనుక మర్మం ఏదో ఉందని భావిస్తారు. యువరాజు ప్రాణాలకు హాని తలపెడుతున్న పిశాచిని గురించి కనుక్కోవడానికి ‘గు-చోన్’ ప్రయత్నిస్తూ ఉంటాడు. ఆ రాజభవనంలో తన తల్లిని హత్యచేసింది ఎవరనే అన్వేషణను యువరాణి కొనసాగిస్తూ ఉంటుంది.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.